క్లుప్తంగా

అలరించిన చిన్నారుల ప్రదర్శనలు



ధరూరు: మండల కేంద్రంలోని ఎంబీ షాలేము చర్చిలో నాలుగు రోజులుగా నిర్వహించిన విరామ బైబిల్ స్కూల్ (వీబీఎస్) కార్యక్రమాల్లో చిన్నారుల ప్రదర్శనలు పలువురిని అలరించాయి. ఏసు క్రీస్తు జననం, కథలు, పద్యాలు ఆదివారం ప్రత్యేక ఆరాధన కార్యక్రమంలో ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన చిన్నారులకు వీబీఎస్ సర్టిఫికెట్‌తో పాటు ప్రత్యేక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ నరేష్ పాల్, సుద్విజా పాల్, రోహేల, బుజ్జి, రేణుక, జ్యోతి, రాజు, శిరీష, సుశాంత, సుకన్య సత్యన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా పతకం గ్రహీతకు సన్మానం



గద్వాల: గతేడాది రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ జగదీష్‌ను ఉత్తమ సేవా పతకానికి ఎంపిక చేశారు. అందులో భాగంగా రెండు రోజుల కిందట హైదరాబాద్‌లో హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, డీజీపీ అంజనీకుమార్ జగదీష్‌కు ఉత్తమ సేవా పతకాన్ని ప్రదానం చేశారు. జగదీష్ సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు కావడంతో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సోమనాద్రి స్టేడియంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బండల వెంకట్రాములు, విజిలెన్స్ సీఐలు నర్సింహారాజు, విజయసింహాలు హాజరై సన్మానించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బండల పాండు, సీనియర్ క్రీడాకారులు విజయ్‌కుమార్, విష్ణు, బషీర్, జగన్, వెంకట్‌రెడ్డి, ఆనంద్, తిరుమల్, నవీన్, శివ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



మల్దకల్: మండలంలోని పాల్వాయి గ్రామ సమీపంలో ఉన్న అడవి ఆంజనేయస్వామి ఆలయం ఎదుట ఆదివారం ఆంజనేయస్వామి నూతన విగ్రహాన్ని వేద పండితులు పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. గద్వాల పట్టణానికి చెందిన దాత బ్రహ్మయ్య రూ.5 లక్షలతో 35 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఆలయం ఎదుట ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరామిరెడ్డి, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాములు, రామకృష్ణ, గోపాల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానా భవనం మంజూరు చేయండి



శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీలో ముస్లింలకు సంబంధించి రెండెకరాల శ్మశాన వాటిక స్థల సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని ముస్లింలు కోరారు. ఆదివారం పట్టణంలోని పెద్ద మసీద్‌లో ముస్లింలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. రెండెకరాల భూమి రిజిస్టర్ కాలేదని విన్నవించారు. మున్సిపాలిటీలో షాదీఖానా భవనం, ఉర్దూ పాఠశాల మంజూరు చేయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు.

దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ

వడ్డేపల్లి మున్సిపాలిటీ పైపాడు మిట్టలు శాంతినగర్‌లో ఆదివారం జరిగిన ఆంజనేయులు కుమార్తె పల్లవి, కృష్ణల వివాహానికి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి హాజరై దంపతులను ఆశీర్వదించారు. ఎమ్మెల్సీ వెంట ఆయా మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

భానుడి భగభగ

- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి
- శీతల పానియాలకు పెరిగిన గిరాకీ



అయిజలో మట్టికుండలు..



పట్టణంలో మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

అయిజ: ఇటీవల కురిసిన వర్షాలకు ఎండల నుంచి ఉపశమనం లభించినా ప్రస్తుతం ఎండలు దంచి కొడుతున్నాయి. ఉదయం 7 గంటలకే సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ప్రజలు 11 గంటలకే బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. తప్పని పరిస్థితుల వల్ల బయటికి వెళ్లిన పనులు ముగించుకొని 12 గంటలకే ఇంటిబాట పడుతున్నారు. మధ్యాహ్నం ఎండ తీవ్రత కారణంగా రోడ్లు జనం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రతిరోజు 40 నుంచి 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. నిప్పులు కక్కే ఎండలకు మనుషులు బెంబేలెత్తిపోతున్నారు.

శీతల పానియాలవైపు పరుగులు..

పట్టణంలోని ప్రధాన దుకాణాలు ఉదయం నుంచి రాత్రి వరకు కిక్కిరిసి పోయేవి. ఎప్పుడు కొత్తబస్టాండ్ ప్రాంతం కళకళలాడేది. వేసవికాలం దృష్ట్యా కొన్ని రోజులుగా ఉదయం 11 గంటలకే బస్టాండ్ ప్రయాణికులు లేక బోసిపోతోంది. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానియాల దుకాణాల వైపు పరుగులు తీస్తున్నారు. మజ్జిగ, పండ్ల రసాలు, చెరుకురసం, కొబ్బరిబోండాలు తాగి ఉపశమనం పొందుతున్నారు. కూలర్లు, ఫ్రిజ్‌లు కొనుగోలు చేస్తున్నారు.

వైద్యుల సలహాలు ...

వేసవిలో వడ దెబ్బ నుంచి రక్షించకోవడానికి ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సలహాలు, సూచనలు చేస్తున్నారు.

- ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో ఎక్కువ సమయం తిరుగొద్దు
- ఇండ్లలో చల్లని గాలి వీచేవిధంగా కూలర్‌లు, ఏసీలు ఆన్‌లో పెట్టుకోవాలి.
- ప్రతి రోజు 5 నుంచి 6 లీటర్ల వరకు శుద్ధమైన తాగునీరు తాగాలి.
- అనారోగ్యంతో చిన్నారులు, వృద్ధులు ఎండలో ప్రయాణం చేయొద్దు.
- తలపై టోపీ ధరించి మోటార్ సైకిళ్లపై ప్రయాణించాలి.
- వడదెబ్బ తగిలినట్లు గుర్తిస్తే నీటిలో ఓఆర్ఎస్ పొడిని కలుపుకొని తాగాలని, అది దొరకని పరిస్థితుల్లో నీటిలో కొంచెం ఉప్పు, పంచదార కలుపుకొని తాగాలి

వడదెబ్బ లక్షణాలు

చర్మంపై చెమట పట్టకపోవడం, తలనొప్పి, కండరాలు పట్టేస్తాయి. వికారం, కళ్లుతిరగడం, వాంతులు చేసుకోవడం లక్షణాలు కనిపిస్తాయి.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి



వివిధ గ్రామాల నుంచి ప్రజలు ప్రతినిత్యం పట్టణం చేరుకుంటారు. స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్టాండ్‌లో, ఆటోల కోసం వేచి ఉంటారు. పేదలు వాటర్ బాటిళ్లు కొని తాగలేని పరిస్థితి. పాతబస్టాండ్, కొత్త బస్టాండ్, పెట్రోల్ బంక్ చౌరస్తా తదితర ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి.

– వెంకటేష్, అయిజ

జాగ్రత్తలు తీసుకోవాలి

ఎండతీవ్రత అధికంగా ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ తగలకుండా వైద్యుల సలహాలు సూచనలు పాటించాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని వెంటనే ఆస్పత్రికి తరలించాలి. రోజురోజుకు ఎండలు అధికం అవుతున్నాయి. తరుచుగా తాగునీరు తాగాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఔషధాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి.

– విష్ణు, పీహెచ్‌సీ, మెడికల్ ఆఫీసర్

యువత క్రీడల్లో రాణించాలి



టాస్ వేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

ఎర్రవల్లిచౌరస్తా: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. ఆదివారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో నూతన మండలం ఏర్పడిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు నీలి శ్రీనివాసులు ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో క్రీడలను నిర్వహించడం వల్ల యువత కలిసి మెలిసి ఉల్లాసంగా ఉంటారన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. గ్రామీణ స్థాయి నుంచి ఉత్తమ ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయికి ఎదిగి గ్రామానికి కుటుంబ సభ్యులకు మంచి పేరును తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మహేశ్వరెడ్డి, గ్రంథాలయ డైరెక్టర్ గుమ్మ గోవర్ధన్, ఆయా గ్రామాల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు ఉన్నారు.

ఘనంగా మాతృదినోత్సవం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని వెంకట్రమణ కాలనీలో మాతృ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం వృద్ధులు, మహిళలు కేక్ కట్ చేసి పంచుకున్నారు. తల్లి దైవంతో సమానమని పలువురు వక్తలు అన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు లక్ష్మీదేవి, చామంతి, మరియమ్మ, కృష్ణమ్మ, గంగమ్మ, పద్మ, పాల్గొన్నారు.

నేటి నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

కేటీదొడ్డి: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం ఈ నెల 15 నుంచి 17 వరకు సీఎం కప్ 2023 మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తునట్లు ఎంపీపీ మహ్మద్ అజార్ మోహీద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పాతపాలెంలో 15న వాలీబాల్, ఖోఖో అథ్లెటిక్స్, 16న కబడ్డీ, 17న వాలీబాల్, కబడ్డీ, ఫైనల్స్ ఉంటాయని తెలిపారు. ఉదయం 8 గంటలకు క్రీడాకారులు క్రీడా ప్రాంగాణానికి చేరుకోవాలని కోరారు.

మల్దకల్: మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో సోమవారం నుంచి 17 వరకు సీఎం కప్ 2023 మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీపీ రాజారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని వేద పాఠశాల పక్కన ఉన్న క్రీడా ప్రాంగణంలో మూడు రోజుల పాటు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్‌లతో పాటు అథ్లెటిక్స్ క్రీడా పోటీలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు.

ప్రమాదకరంగా గుంత



మానవపాడు: మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. కొన్ని చోట్ల గుంతలు ఏర్పడి ప్రయాణానికి ఆటంకంగా మారాయి. మండల కేంద్రంలోని రహదారి మధ్యలో గుంత ఉండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జాతీయ రహదారిపై వ్యక్తికి గాయాలు

మానవపాడు: జాతీయ రహదారి–44పై బైక్ అదుపు తప్పి బ్రిడ్జి పక్కన ఉన్న డివైడర్‌ను ఢీ కొని వ్యక్తికి గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపుకు గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా బోరవెల్లి, మానవపాడు స్టేజీ మధ్యలో వాగుపై ఉన్న బ్రిడ్జి సమీపంలోని బైక్ అదుపు తప్పింది. దీంతో వాహనం డివైడర్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న వ్యక్తి గాయాలు కావడంతో వెంటనే హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఎస్ఐ సంతోష్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె



మల్దకల్‌లో సమ్మె చేస్తున్న వీఓఏలు

మల్దకల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 28వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో వీఓఏలు నిరసన తెలిపారు. అనంతరం వీఓఏల సంఘం మండల నాయకులు బాషా, చంద్రాములు మాట్లాడుతూ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించి రూ.10 లక్షల ప్రమాదబీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం నాయకులు గోవిందు, హనుమంతు, కృష్ణ, వెంకట్రాములు, అపర్ణ, నవీన, ఏస్తేర్, తిరుమలేష్, జనార్దన్, తిమ్మప్ప పాల్గొన్నారు.

ట్రాఫిక్‌తో తంటాలు



పట్టణంలో వాహనాల రద్దీ

ఆత్మకూర్: పట్టణంలోని గాంధీచౌక్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సమయం వృథా అవుతుందని పాలకమండలి, పోలీసులు దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు. గాంధీచౌక్ నుంచి కొత్తకోట రోడ్డు, బస్టాండ్‌రోడ్డు, అమరచింతరోడ్డు వైపుగా డివైడర్ల నిర్మాణ పనులు చేపడుతున్న కారణంగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని చైర్‌పర్సన్ గాయత్రి తెలిపారు. డివైడర్లు, ఇరువైపుల సీసీ రోడ్ల పనులు, చెరువు కట్ట నుంచి గాంధీచౌక్ వరకు బీటీరోడ్డు పనులు త్వరలోనే చేపడుతామని చైర్‌పర్సన్ పేర్కొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనలు

అమరచింత: మండలంలోని ఈర్లదిన్నెలో సోమవారం నుంచి దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. 15న సత్యానంద భారతి స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. వినాయక, సుబ్రహ్మణ్యస్వామి, శివలింగం, నందీశ్వర, ఆంజనేయ స్వామి, నాగులు, నవగ్రహ, ధ్వజస్తంభం, కార్తీకదీప స్తంభం, బొడ్రాయికి పూజలు నిర్వహించి ప్రతిష్ఠాపన చేయనున్నారు. మూడు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఉంటాయని, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఐజీ రమేష్‌రెడ్డిని సన్మానించిన నాయకులు



సన్మానిస్తున్న నాయకులు

ఆత్మకూర్: ఐజీగా నియమితులైన మస్తిపురం రమేష్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు, శాలువాతో సన్మానించారు. ఆదివారం పదోన్నతి పొందిన తర్వాత మండలంలోని మస్తిపురంకు వచ్చిన ఆయనను రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు వాకిటిశ్రీహరి, చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అయ్యూబ్‌ఖాన్, తులసీరాజ్, రహెమతుల్లా, పరమేష్, నల్లగొండ శ్రీను, మహేందర్‌రెడ్డి, రవీందర్, శరణప్ప, అరుణ్, శ్యాం, విష్ణువర్ధన్ తదితరులు ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



అమరవాయి నుంచి కలుకుంట్ల వెళ్లే దారిలో..

మానవపాడు: ఎన్ని ప్రమాదాలు జరిగినా విద్యుత్ అధికారులు మాత్రం నిర్లక్ష్యం వీడటం లేదు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిన వాటిని సరిచేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని అమరవాయి నుంచి కలుకుంట్లకు వెళ్లే ప్రధాన రహదారిలో విద్యుత్ స్తంభానికి ఇనుపచువ్వలు తేలాయి. దీంతో స్తంభం ఓ వైపుకు ఒరిగింది. దీంతో విద్యుత్ అధికారులు మార్చాల్సి ఉన్న స్తంభానికి ఇరువైపులా రెండు స్తంభాలను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ఈ రహదారి గుండా నిత్యం వేలాది వాహనాలు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు బిక్కుబిక్కుమని ప్రయాణిస్తున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిమితికి మించి ప్రయాణం



గట్టు నుంచి మల్దకల్‌కు కూలీలను తరలిస్తున్న ఆటో

మల్దకల్: ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నా వాహనదారుల్లో మార్పు రావడం లేదు. రోడ్డు నిబంధనలు పాటించాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నా.. ఇంకా ఆటోలు, జీపుల, ప్రైవేట్ వాహనదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించుకొని గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. ప్రతినిత్యం వివిధ గ్రామాల నుంచి కూలీలు పనుల కోసం ఇతర గ్రామాలకు వెళ్తుంటారు. గద్వాల, ధరూరు, గట్టు ప్రాంతాల నుంచి గూడ్సు వాహనాలతో పాటు ప్యాసింజర్ వాహనాల్లో పరిమితికి మించి కూలీలను తరలిస్తున్నారు. గూడ్సు వాహనాల్లో ప్రయాణికులను చేరవేస్తున్నా చూసి చూడనట్లు వ్యవహరించడంపై అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా నిబంధనలు విరుద్ధంగా ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తున్న వాహనదారులపై కఠినంగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



పుల్లూరులో ఆంజనేయ స్వామి విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



కిష్టాపురంలో ..

అయిజ: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఆలయాల్లో అర్చకులు ఆంజనేయ స్వామి విగ్రహాలకి అభిషేకాలు, అర్చనలు చేశారు. తొత్తినోనిదొడ్డిలో బాలహనుమాన్ ఆలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా మండలంలోని కిష్టాపురంలో కొండపై వెలిసిన ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించి స్వామివారి చిత్రపటాన్ని వెంకటాపురం స్టేజీ వరకు ఊరేగించారు.

ఉండవెల్లి: మండలంలోని మండల కేంద్రం, కంచుపాడు, తక్కశిల, ప్రాగటూరు, మారమునగాల–2, అలంపూర్ చౌరస్తాలోని ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం డి.బూడిదపాడు ఆంజనేయ స్వామి ఆలయం నుంచి ప్రాగటూరు గ్రామానికి భక్తులు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలంపూర్ చౌరస్తాలో స్వామి వారికి ఆకుపూజ నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. పుల్లూరులో పుర వీధులలో ఊరేగించి, సీతారాముల వేషధారణలో అలరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1991–92 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పలువురు ఆదివారం సమ్మేళనంలో భాగంగా ఒకే వేదికపై కలుసుకున్నారు. జీవితంలో వివిధ స్థాయిల్లో స్థిరపడిన వారు యోగ క్షేమాలను తెలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు రాఘవాచారి, వేమన్న, బాలచంద్రయ్య, పార్థసారథి, శైలజ తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో రామలింగం, కురుమయ్య, రాజవర్ధన్‌రెడ్డి, బీచుపల్లి, ఎల్లస్వామి, పర్వతాలు, దయాకర్, కృష్ణయ్య, ముబిన్, అరుణ, లత తదితరులు పాల్గొన్నారు.

మత రాజకీయాలకు తిరస్కరణ తప్పదు

ఆత్మకూర్: బీజేపీ మత రాజకీయాలకు కాలం చెల్లిందని, ఇందుకు కర్ణాటకలోని ఎన్నికల్లో సాక్ష్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్ అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక ఎన్నికల్లో స్వయంగా ప్రధాని ఎన్నోసార్లు ప్రచారం చేసి, ఉచితంగా సిలిండర్లు ఇస్తామని ప్రకటించినా, బజరంగ్ బలి పేరుతో రెచ్చగొట్టిన అక్కడి ప్రజలు ఓటు ద్వారా సమాధానం చెప్పారని అన్నారు. పార్టీకి 136 మంది ఎమ్మెల్యేలు గెలుపొంది సంపూర్ణంగా ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని పేర్కొన్నారు. ప్రజల్లో మార్పు వస్తుందని బీజేపీ ప్రభుత్వ ఆస్తులను అమ్మడమే తప్పా, అభివృద్ధి లేదనే విషయం ప్రజలకు అర్థమైపోయిందని ఎద్దేవ చేశారు. తెలంగాణలో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అయ్యూబ్ ఖాన్, తులసీరాజ్, రహెమతుల్లా, పరమేష్, శ్రీను ఉన్నారు.

పాఠశాల ఆవరణ మురుగుమయం

- దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు



పాఠశాల రోడ్డు పక్కన చేరిన మురుగు

ఆత్మకూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల ఆవరణలో మురుగుమయం కావడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అకాల వర్షాకాల కారణంగా చేరిన నీటితో పాటు, మురుగు నిల్వ ఉండడంతో దోమల అధికసంఖ్యలో వస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. పాఠశాల ప్రారంభం అయ్యేలోపు డ్రైనేజీలు నిర్మించి, ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. ఈ విషయమై పాలకమండలి దృష్టికి తీసుకెళ్లామని వార్డు కౌన్సిలర్ నాగలక్ష్మి తెలిపారు.